# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-03-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుమల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

**2. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనలకు ప్రతీకగా నిలిచే రంజాన్... ఈద్- ఉల్-ఫితర్ పండుగను ముస్లిం సోదరులు ఈరోజు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు.**

**3. 2026-27 సంవత్సరానికి 3 లక్షల 24 వేల 234 కోట్ల రూపాయల వార్షిక బడ్జెట్‌ను తెలంగాణ ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క శాసనసభలో ప్రవేశపెట్టారు.**

**4. కూటమి ప్రభుత్వం యువతకు ఉద్యోగాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆంధ్రప్రదేశ్ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.**

==========================

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుమల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం నిన్న రాత్రి తిరుమల చేరుకున్న ముఖ్యమంత్రి... తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్, కార్యానిర్వహణాధికారి, అదనపు కార్యనిర్వహణ అధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యుత్ వినియోగం, పవన విద్యుదుత్పత్తి వివరాలు తెలుసుకున్నారు. తిరుమలలో పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, తదితర అంశాలపై చర్చించారు. ఇందుకు టిటిడి తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు.

---------------------------

పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమలలో ఏర్పాటు చేసిన ఆహార పరీక్షా కేంద్రాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు ప్రారంభించన్నట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు. పుణ్య క్షేత్రాల్లో ఈ తరహా పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయడం ఇదే ప్రథమమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నూనె, పాలు, నెయ్యిలలో పెస్టిసైడ్స్, ప్రిజర్వేటివ్స్ వంటి అవశేషాలను ఈ పరీక్షా కేంద్రంలో గుర్తించే అవకాశం ఉందని తెలిపారు. కెమికల్ ఎనాలిసిస్, మైక్రోబయాలజీ ఎనాలిసిస్ పరీక్షలకు అవసరమైన పరికరాలు, యంత్రాలను ఈ పరీక్షా కేంద్రంలో సమకూర్చామని మంత్రి వెల్లడించారు.

---------------------------

ముస్లింలు అత్యంత పవిత్రంగా పాటించిన రంజాన్ మాస ఉపవాస దీక్షలు శుక్రవారం రాత్రి ఆకాశంలో నెలవంక కనిపించడంతో ముగిశాయి. ఈద్ ముబారక్.. అంటూ ముస్లిం సోదరులు శుభాకాంక్షలు చెప్పుకొన్నారు.

---------------------------

పవిత్ర రంజాన్ మాసం భక్తి, ఉపవాసం, దానధర్మాలు, ఆత్మపరిశీలనకు అంకితమైన కాలంగా గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ తెలిపారు. ఈద్-ఉల్-ఫితర్ పర్వదినం సందర్భంగా రాష్ట్రంలోని ముస్లిం సోదర, సోదరీమణులకు ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలియజేశారు. విశ్వాసం, న్యాయం, కరుణ, నైతిక ప్రవర్తనల ప్రాముఖ్యతపై పవిత్ర ఖురాన్ అందించిన బోధనలు, యుగయుగాలుగా సమాజాన్ని తీర్చిదిద్దుతూ వస్తున్నాయన్నారు.

పవిత్ర రంజాన్ పర్వదినం ముస్లిం సోదర, సోదరీమణుల జీవితాల్లో ఆనందం, శాంతి, ఆరోగ్యం, ఐశ్వర్యం నింపాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. రంజాన్ సందర్భంగా ముస్లిం సోదర, సోదరీమణులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ రంజాన్ మాసంలో పేదలకు దానంతో సమాజంలో సమానత్వం పెరుగుతుందన్నారు.

---------------------------

రంజాన్ పండుగ ఆధ్యాత్మికత, సోదరభావాన్ని, దాన గుణాన్ని పెంపొందిస్తుందని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల తెలిపారు. ముస్లిం సోదర, సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

రంజాన్ పండుగ లౌకికవాదానికి, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు.

---------------------------

2026-27 సంవత్సరానికి 3 లక్షల 24 వేల 234 కోట్ల రూపాయల వార్షిక బడ్జెట్‌ను తెలంగాణా ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శాసనసభలో నిన్న ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ... దేశంలో తెలంగాణను అగ్రగామిగా నిలబెట్టాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వానికి తొలి ప్రాధాన్యమని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి 5 లక్షల రూపాయల జీవిత బీమా అందించే విధంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు మంత్రి పేర్కొంటూ..

వాయిస్...30 సెకన్లు

శాసన మండలిలో పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. అనంతరం ఉభయ సభలను సోమవారానికి వాయిదా పడ్డాయి.

---------------------------

రాష్ట్రంలో గృహ వినియోగ వంట గ్యాస్‌కు కొరత లేదని ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా కానూరులోని పౌరసరఫరాల భవన్‌లో నిన్న ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత వారం రోజుల్లో ఇలాంటి అపోహల వల్లనే అధికంగా బుకింగ్స్ నమోదయ్యాయని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో గ్యాస్ సిలిండర్ల నుండి పైప్డ్ నేచురల్ గ్యాస్ కి మారేలా

కొత్త విధానాన్ని సోమవారానికి సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు మంత్రి వెల్లడిస్తూ..

వాయిస్....27 సెకన్లు

-----------------------------

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం యువతకు ఉద్యోగాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆంధ్రప్రదేశ్ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ను విడుదల చేసిందని తెలిపారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పని చేస్తున్నట్లు చెప్పారు. గడచిన రెండేళ్లలోనే 6 లక్షల 28 వేల 347 ఉద్యోగాలు కల్పించామని మంత్రి పేర్కొంటూ..

వాయిస్..21 సెకన్లు

-----------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 132 వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు, మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు, నరేంద్రమోదీ యాప్‌కు ఈ నెల 27వ తేదీ వరకు పంపవచ్చు.

-----------------------------

వేసవిలో ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బంది రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి ధనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. ఆమె నిన్న హైదరాబాద్‌లోని సచివాలయంలో అధికారులతో వేసవిలో నీటి ఎద్దడి, మిషన్ భగీరథ పని తీరుపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఎక్కడైనా పైపులైన్లు మరమ్మత్తులు, ఇతర పనులు ఉంటే ముందుగానే గ్రామస్తులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

-----------------------------

పశ్చిమ మధ్య బంగాళాఖాతంపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. గల్ఫ్ ఆఫ్ మన్నార్ నుండి ఉత్తర అంతర కర్ణాటక వరకూ, అలాగే తమిళనాడు అంతర్భాగంగా అల్పపీడన ద్రోణి కొనసాగుతోందని వాతావరణం కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు పేర్కొన్నారు. వీటి ఫలితంగా ఉత్తర కోస్తా, యానాంలలో ఈరోజు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని ఆయన తెలియజేస్తూ..

వాయిస్..20 సెకన్లు

తెలంగాణలో ఈరోజు తేలికపాటి నుండి ఒక మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరబాదులోని వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలలో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

=====================